క్లుప్తంగా

కొత్తూరు సుబ్బరాయుడు సన్నిధిలో జిల్లా జడ్జి



జడ్జి ప్రతిభాదేవికి స్వామివారి ప్రసాదాలు అందజేస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన సుబ్రహ్మణేశ్వర స్వామిని ఆదివారం కర్నూలు జిల్లా జడ్జి ప్రతిభాదేవి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈఓ రామక్రిష్ణ, ప్రధానార్చకులు కంపమళ్ల సురేష్ శర్మ, కృష్ణయ్యశర్మ ఆలయమర్యాదలతో జడ్జికి స్వాగతం పలికారు. స్వామవారికి అభిషేకం,అర్చనలు చేశారు. అనంతరం జడ్జికి తీర్థప్రసాదాలు అందజేశారు.

నిలిచిపోయిన రాకపోకలు

పాణ్యం : మండల పరిధిలోని పిన్నాపురం కొండ ఘాట్‌లో ఓ కంటైనర్ మరమ్మతులకు గురికావడంతో మలుపుల వద్ద నిలిచి పోయింది. గ్రీన్‌కో పరిశ్రమకు యంత్రాలను తీసుకొని వెళ్తున్న కంటైనర్ మలుపులు ఎక్కే క్రమంలోని క్లచ్‌ప్లేట్లు కట్ అయ్యాయి. దీంతో కంటైనర్ దారికి అడ్డంగా నిలిచి పోయింది. ఆదివారం ఆ గ్రామానికి రాకపోకలు నిలిచి పోయాయి. కేవలం ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు మాత్రమే దారి ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉదయం, సాయంత్రం విద్యార్థులు, ఉద్యోగులు, ఇతర వ్యాపారస్తులు ఇబ్బంది పడ్డారు.

ఒరిగిన విద్యుత్ స్తంభం



బిలకలగూడూరు - నంద్యాలకు రోడ్డులో ఒరిగిన విద్యుత్ స్తంభం

గడివేముల: మండలంలో ఒరిగిన విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడు విరిగి పడతాయోనని రోడ్డుపై వెళ్లే ప్రయాణికులు భయాందోళనలకు గురవుతున్నారు. బిలకలగూడూరు నుంచి నంద్యాల మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగుతుంటాయి. అదేవిధంగా రైతులు, ప్రజలు, విద్యార్థులు జిల్లా కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వెళ్తుంటారు. దారికి ఇరువైపులా ఉన్న స్తంభాలు ఒక వైపు ఒరిగి ప్రమాదకంగా ఉన్నాయి. కొన్నేళ్ల నుంచి ఇలానే ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షా కాలం కావడంతో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోక ముందే విద్యుత్ శాఖ అధికారులు స్పందించి స్తంభాలను సరిచేయించాలని గ్రామస్తులు, వాహనచోదకులు కోరుతున్నారు.

గంజాయి తీసుకెళ్తున్న వ్యక్తి అరెస్టు

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె క్రాస్‌రోడ్డు వద్ద గంజాయి తీసుకెళ్తున్న ఓ వ్యక్తిని పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు. రెండు కేజీలు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం జిల్లాలో విపరీతంగా గంజాయి విక్రయాలు పెరిగిన నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. నంద్యాల పట్టణానికి చెందిన వ్యక్తిగా పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే గంజాయి ఎక్కడి నుంచి ఎక్కడి తీసుకెళ్తున్నారు... ఎవరి నుంచి సరఫరా అవుతుంది అనే విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

జీఓ నంబర్ 115ను రద్దు చేయాలి

కర్నూలు(హాస్పిటల్): కాంట్రాక్టు స్టాఫ్‌నర్సుల భవిష్యత్‌ను నాశనం చేసే విధంగా ఉన్న జీఓ నంబర్ 115ను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని టీఎన్‌టీయూసీ స్టేట్ జనరల్ సెక్రటరీ అశోక్‌కుమార్ కోరారు. ఆదివారం కర్నూలులో తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న స్టాఫ్‌నర్సులందరినీ రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. జీఓ నంబర్ 115 వల్ల వారికి అన్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో ఏపీ నర్సెస్ అసోసియేషన్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు శాంతి భవాని, ఏపీ తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎ.మాధవరాజు, జనరల్ సెక్రటరీ సి.బంగారి తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో రాణించాలి

కర్నూలు(అర్బన్): ఆత్మరక్షణ క్రీడ తైక్వాండోలో నిత్యం సాధన చేయాలని 4వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఊట్ల రమేష్ అన్నారు. ఆదివారం స్థానిక కొండారెడ్డి బురుజు కేఎంసీ పార్కులో తైక్వాండో బెల్ట్ గ్రేడ్ల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు పతకాలు, బెల్టులు అందించారు.

కొలువుదీరిన గణనాథులు

పాణ్యం: వినాయక చవితి ఉత్సవాలు శనివారం భక్తిశ్రద్ధల మధ్య ప్రారంభమయ్యాయి. మండల కేంద్రం పాణ్యంతోపాటు గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో బొజ్జ గణపయ్యలు కొలువుదీరారు. వివిధ రూపాల్లో గణనాథులు భక్తులకు దర్శనమిచ్చారు. వినాయకుడికి ఇష్టమైన ఉండ్రాళ్లు, వెలగ పండ్లు, చెరకు తదితర పిండివంటకాలు స్వామివారికి భక్తులు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పాణ్యంలోని రచ్చకట్ట వద్ద ఆదివారం మధ్యాహ్నం మండలం వద్ద అన్నదానం చేశారు. అలాగే కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీ వల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన భారీ వినాయకుడు చూపరులను ఆకట్టుకున్నారు. ఆయా కాలనీల్లో కొలువైన స్వామివారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

గడివేముల: మండలంలో వినాయకచవితి వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. ప్రతి గ్రామంలో వినాయకుని ప్రతిమలు ఏర్పాటు చేసి విశేష పూజలు నిర్వహించారు. పసుపు గణపతికి పూజలు చేసిన అనంతరం మూల, ఉత్సవ వినాయక విగ్రహాలకు పంచామృత అభిషేకం, విశేష ద్రవ్యాభిషేకంతోపాటు అష్టోత్తర శతనామార్చన, గణపతి హోమం తదితరు పూజలు నిర్వహించారు.



చిందుకూరులో వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు

గణపయ్యలకు ప్రత్యేక పూజలు

కోడుమూరు రూరల్ : మండల కేంద్రం కోడుమూరుతోపాటు గ్రామాల్లో వినాయక చవితి సందర్భంగా గణనాథుడు కొలువుదీరారు. ఆయా గ్రామాలు, కాలనీల్లో కొలువుదీరిన గణపయ్యలను భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఉత్సవాల సందర్భంగా ఆదివారం పట్టణంలోని వినాయక మండపాల వద్ద నిర్వాహకులు అన్నదానం చేశారు. శ్రీచౌడేశ్వరీ దేవి వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి కోడుమూరు ఎస్‌ఐ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు అన్నదానం చేశారు. అదేవిధంగా పట్టణంలో విస్తృతంగా పర్యటించిన ఎస్‌ఐ మండపాల నిర్వాహకులకు సూచనలు చేశారు. గణపయ్యలను నిమజ్జనానికి తరలించేప్పుడు వరసక్రమం పాటించాలని, ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా మసలుకోవాలని సూచించారు.

నేడు కోడుమూరులో నిమజ్జనం

కోడుమూరులో సోమవారం వినాయక విగ్రహాలను వెంకటగిరి రోడ్డువైపు గల బావిలో నిమజ్జనం చేసేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. నిమజ్జనం సందర్భంగా బావి వద్ద ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా కమిటీ సభ్యులు బారికేడ్లు, లైట్లను ఆదివారం ఏర్పాటు చేశారు.



రచ్చకట్ట వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడు



వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



నాయుడుసారు వీధిలో కొలువుంచిన గణపయ్య

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌తోపాటు గ్రామాల్లో శనివారం గణపయ్యలు కొలువుదీరారు. మండపాల్లో కొలువైన స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సి.బెళగల్‌లోని నాయుడుసారు వీధిలో కొలువదీరిన 14 అడుగుల భారీ విగ్రహం భక్తులను ఆకట్టుకుంటుంది. మాలదాసరి వీధిలోని వినాయకుడిని సర్పంచ్ దంపతులు పాందురంగన్న, సురవర్ధమ్మ దర్శించుకుని పూజలు చేశారు. వినాయక మండపాల దగ్గర యువకుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బ్రాహ్మణదొడ్డి గ్రామంలో కొలువుంచిన స్వామివారిని వైఎస్సార్‌సీపీ నాయకుడు సంధ్య విక్రమ్‌కుమార్ దర్శించుకుని పూజలు చేశారు.

సి.బెళగల్‌లో నేడు నిమజ్జనం

మండంలో ప్రతిష్ఠించుకున్న వినాయక విగ్రహాలను సోమవారం నిమజ్జనం చేసేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నిమజ్జనం సందర్భంగా తీసుకోవాల్సి జాగ్రత్తలను కమిటీ సభ్యులకు ఎస్‌ఐ తిమ్మారెడ్డి సూచించారు. వరసక్రమం పాటించాలని, ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా స్వావారి విగ్రహాలను నిమజ్జనానికి తరలించాలని చెప్పారు. అయితే పోలకల్ గ్రామంలో చెన్న సోమేశ్వరాస్వామి ఆలయ దగ్గర ఏర్పాటు చేసిన వినాయకుడిని మాత్రం ఐదు రోజులపాటు పూజల అనంతరం బుధవారం నిమజ్జనం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.



వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు



భక్తులకు అన్నదానం చేస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులు



కొండపేటలో ఆకర్షణగా గణనాథుడు



పండెండు అడుగుల భారీ వినాయకుడు

రాజనీతిజ్ఞుడు ఆంధ్రకేసరి

కర్నూలు కల్చరల్: టంగుటూరి ప్రకాశం పంతులు ధైర్యశీలి, రాజనీతిజ్ఞుడని క్లస్టర్ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. క్లస్టర్ యూనివర్సిటీ, సాహితీ సదస్సు సంయుక్తంగా ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు, మేడూరి దీక్షితులు వెంకటసుబ్బయ్య జయంతి కార్యక్రమాన్ని ఆదివారం కేవీఆర్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. ఆంధ్రకేసరి, మేడూరి లాంటి వారి జీవితం సమాజానికి ఆదర్శమన్నారు. సాహితీ సదస్సు అధ్యక్షుడు కురాడి చంద్రశేఖర కల్కూర మాట్లాడుతూ.. పేదరికం నుంచి అత్యంత మేధావిగా, రాజనీతిజ్ఞుడుగా, న్యాయవాదిగా ఎదిగి దేశ స్వాతంత్ర సమరంలో ప్రధాన పాత్ర పోషించి ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా సేవలందించారని కొనియాడారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ సుబ్రహ్మణ్యకుమార్, ఆంధ్రకేసరి యువజన సంఘం కార్యదర్శి రాజమహేంద్రం మాదిరాజు శ్రీనివాస్, సాహితీ సదస్సు కార్యదర్శి జేఎస్‌ఆర్కే శర్మ, నరసం అధ్యక్షులు కావెం సుబ్బలక్ష్మమ్మ మాట్లాడారు. వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అంతకుముందు ఆంధ్రకేసరి, మేడూరి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నరసం కార్యదర్శి పార్వతీదేవి, బ్రాహ్మణ సంఘం నాయకులు హెచ్‌కే మనోహర్, గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్రకేసరి, మేడూరి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న అతిథులు

29న బ్రాహ్మణ సంఘం ఎన్నికలు

కర్నూలు(అర్బన్): నగర బ్రాహ్మణ సంఘం (రిజిస్టర్ నంబర్: 411/2015) ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎన్నికల అధికారిగా నియమితులైన క్లో వేణుగోపాల్ శర్మ తెలిపారు. ఆదివారం స్థానిక సంకల్‌భాగ్‌లోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బ్రాహ్మణ నేతలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలకు సంబంధించి ఈ నెల 20వ తేదీలోగా సభ్యత్వాలు పూర్తి కావాలన్నారు. అనంతరం గుర్తింపు కార్డులు అందించి ఓటు హక్కు కల్పిస్తారన్నారు. 22, 23 తేదీల్లో నామినేషన్ల స్వీకరణ, 24న పరిశీలన, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉపసంహరణకు అవకాశం ఉంటుందని చెప్పారు. 25న బరిలో నిలిచిన అభ్యర్థుల ప్రకటన, 29న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్, మధ్యాహ్నం 3 గంటల నుంచి ఓట్లను లెక్కించి విజేతలకు ధ్రువ పత్రాలు అందిస్తామన్నారు. నాయకులు చల్లా నాగరాజశర్మ, కంచుగంటల శ్యాంసుందర్‌శర్మ, సండేల్ చంద్రశేఖర్, నాగులవరం రాజశేఖర్, ఆకెళ్ల రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ ఫారాలను విడుదల చేస్తున్న నాయకులు

సాంస్కృతికాంశాల పోటీలకు విశేష స్పందన

కర్నూలు కల్చరల్: విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే ఆధ్యాత్మికత, నైతిక విలువలు, సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని శ్రీగణేష్ మహోత్సవ కేంద్ర సమితి నగర అధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు అన్నారు. ఆదివారం కేంద్ర సమితి ఆధ్వర్యంలో నగర శివారులోని క్రైడో స్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖన తదితర సాంస్కృతికాంశాలపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోటీలకు విశేష స్పందన లభించిందని, 571 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు చెప్పారు. కరివేన నిత్యాన్నదాన సత్రం కార్యదర్శి డాక్టర్ వేణుగోపాల్, కె.చెన్నయ్య, శ్రావ్య కార్తీక్, సూరా వెంకటరెడ్డి, మేడా సుబ్రహ్మణ్య స్వామి మాట్లాడారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. మామిళ్లపల్లి రాజేష్ శర్మ, చింతలపల్లి రామకృష్ణ, రామ్ ప్రసాద్ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనలో పాల్గొన్న అతిథులు

అటవి కాదు... ఎంపీడీఓ కార్యాలయ పరిసరాలు

కోడుమూరు రూరల్ : కోడుమూరులోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణం అటవిని తలపిస్తుంది. ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలతో నిండిపోయింది. చిట్టడవులను తలపిస్తున్నాయి. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నాలుగు, ఐదు గ్రామ సచివాలయాలతోపాటు వెలుగు కార్యాలయం, ప్రాథమిక పాఠశాల ఉన్నాయి. ఆయా కార్యాలయాల్లో పని నిమిత్తం నిత్యం అనేక మంది ప్రజలు వచ్చి వెళ్తుంటారు. పిచ్చిమొక్కలతో కార్యాలయ ఆవరణ అంతా నిండిపోయింది. ఈ మధ్య కురిసిన వర్షాలతో బురద మయంగా మారింది. దీంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఆవరణలోనే విద్యార్థులు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన జారుడుబండ పిచ్చిమొక్కలతో నిండిపోయింది. పాఠశాలకు విద్యార్థుల రాకపోకల సందర్భాల్లో ఏ మూల నుంచి ఏ విషపురుగు వస్తుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కల తొలగింపు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పిచ్చిమొక్కలతో నిండిపోయిన ఎంపీడీఓ కార్యాలయ ఆవరణ



ఏపుగా పెరిగిన మొక్కలు



చిన్నారులు ఆడుకునే జారుడుబండ చుట్టూ పిచ్చిమొక్కలు

అధ్వానం.. ప్రధాన రహదారి!

కర్నూలు(రూరల్) : మండల పరిధిలోని మిలిటరీ కాలనీ గ్రామ సమీపాన కర్నూలు గుంటూరు ప్రధాన రహదారిపై అధ్వానంగా మారింది. గ్రామంలోని మురుగునీరు రోడ్డుపైకి చేరుకోవడంతో వాహణదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ రోడ్డుపై శ్రీశైలం, విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం మొదలగు ప్రాంతాలతో పాటు కర్నాటక, తెలంగాణకు చెందిన వాహనాల రాకపోకలతో నిత్యం రోడ్డు రద్దీగా ఉంటుంది. గ్రామంలో సరైన డ్రైనేజీ వ్యవస్థల లేకపోవడంతో ప్రధాన రోడ్డుపైకి వర్షపునీటితోపాటు మురుగునీరు వస్తుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పంధించి గ్రామంలో డ్రైనేజీలకు మరమ్మతులు చేయించాలని స్థానికులతోపాటు వాహనచోదకులు కోరుతున్నారు.



మిలటరీ కాలనీ వద్ద మెయిన్ రోడ్డుకు ఇరువైపులా నిలిచిన వర్షపునీరు

కంటి పరీక్షలకు మసక !

- ముఖ్యమంత్రి ఈ ఐ కేంద్రం సేవలు నిలిపివేత
- టీడీపీ ప్రభుత్వ నిర్ణయంతో ఇబ్బందులు పడుతున్న పేదలు

పాణ్యం: పేదప్రజలకు అత్యాధునిక యంత్రాలకు పరీక్షలు చేసి ఉచితంగా కంటి అద్దాలు అందించే ముఖ్యమంత్రి ఈ ఐ కేంద్రం సేవలకు బ్రేక్ పడింది. ఈ పథకం ద్వారా ప్రతి నియోజకవర్గంలోని 30పడకల ఆసుపత్రిలో కేంద్రం ఏర్పాటు చేశారు. కంటి పరీక్షలు చేసేందుకు ఫండస్‌మిషన్, ఏఆర్ మిషన్‌లు ఏర్పాటు చేసి ఓ ఆప్తాలిక్ అసిస్టెంట్‌ను నియమించారు. యంత్రాల సాయంతో కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. రెండువారాల్లో కంటి అద్దాలు కూడా అందజేస్తారు. ఈ పథకం ద్వారా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో వేల సంఖ్యలో కంటి పరీక్షలు చేసి ఉచితంగా అద్దాలు అందించారు. ఈ ప్రాజెక్టును 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. నంద్యాల జిల్లాలో ఆయా నియోజకవర్గ కేంద్రాల్లోని 30పడకల ఆసుపత్రిలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఈ పథకాన్ని ప్రవేశపెట్టినప్పటికీ 2019లో అధికారంలోకి వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈపథకాన్ని యథావిధిగా అమలు చేశారు. అయితే 2024లో అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం ఈ పథకానికి బ్రేక్‌లు వేసింది. దీంతో పేదలు, వృద్ధులు కంటి సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



పాణ్యం ఆసుపత్రిలో కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం (ఫైల్)

ఐదు రోజులుగా నిలిచిపోయిన సేవలు

గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో ముఖ్యమంత్రి ఈ ఐ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఈ పథకం ద్వారా చికిత్సలు చేయించుకుని తిరిగి కంటి వెలుగు పొందారు. ఈ పథకానికి సంబధించి సేవలు నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఐదు రోజులగా ఓపీలు చూడంలేదు. గతంలో పరీక్షలు చేసినవారికి మాత్రం అద్దాలు అందిస్తున్నారు. ఏదైనా కంటి సమస్య వస్తే మళ్లీ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లాల్సిందేనా అంటూ పేదలు నిట్టూర్చుతున్నారు.

విస్తృతంగా కంటి పరీక్షలు

గత ఐదేళ్లలో పేదలకు ఈ పథకం ద్వారా విస్తృతంగా కంటి పరీక్షలు చేశారు. ఎంతోమంది కంటి సమస్యలకు పరిష్కారం లభించింది. కేవలం పాణ్యం 30పడకల ఆసుపత్రిలో 2018లో ఈ కేంద్రాన్ని ప్రారంభిస్తే ఇప్పటి వరకు 6,813మందికి చికిత్సలు చేశారు. అదేవిధంగా 5,335మందికి కంటి అద్దాలు అందించారంటే గ్రామీణులు ఏవిధంగా సేవలు ఉపయోగించుకున్నారో అర్థం చేసుకోవచ్చు. అయితే టీడీపీ ప్రభుత్వం ఈ సేవలకు నిలిపివేయండతో గ్రామీణ ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం

ప్రస్తుతం ఈ కేంద్రాల్లో పరీక్షలు, ఆన్‌లైన్లో అద్దాలు నమోదు చేసే ప్రక్రియను నిలిపివేశాం. ఈనెల 15వ తేదీ వరకు గతంలో కంటి పరీక్షలు చేసుకున్న వ్యక్తులకు అద్దాలు రాగానే పంపిణీ చేస్తాం. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే తిరిగి సేవలు కొనసాగిస్తాం. పూర్తి స్థాయిలో ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది.

– శివప్రసాద్, ప్రాజెక్ట్ డిస్ట్రిక్ మెనేజర్

ఘనంగా చర్చి వార్షికోత్సవం



వేడుకలను ప్రారంభిస్తున్న చర్చి అధ్యక్షుడు ఏడీప లింకన్, తదితరులు

కర్నూలు(అర్బన్): నగరంలో కోల్స్ సెంటీనియల్ బాప్టిస్టు చర్చి 106వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. చర్చి అధ్యక్షుడు ఏడీప లింకన్, పాస్టర్లు, స్టాండింగ్ కమిటీ సభ్యులు క్రీడా పోటీలను ప్రారంభించారు. వార్షికోత్సవ కమిటీ చైర్మన్ పి.దినకర్, కార్యదర్శి కే.ప్రవీణ్‌కుమార్ పర్యవేక్షణలో పోటీలు మూడు రోజుల పాటు కొనసాగనున్నాయి. వాలీబాల్, ఫుట్‌బాల్, క్యారమ్స్, క్రికెట్, బ్యాడ్మింటన్ క్రీడలను చర్చి ఆవరణలో నిర్వహించారు. సభ్యులు రవికుమార్, సంపత్, నరేష్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.